క్లుప్తంగా

జగనన్నను ఆశీర్వదించాలి



వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టిఎన్.దీపికకు ఒడి బియ్యం సమర్పిస్తున్న మహిళలు

హిందూపురం: రాష్ట్రంలో మహిళలకు అన్ని విధాలుగా అండగా నిలిచిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అక్కచెల్లెమ్మలందరూ ఆశీర్వదించాలని నియోజకవర్గ సమన్వయకర్త టిఎన్.దీపిక కోరారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా విద్యానగర్ కాలనీలోని లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా మహిళల సామూహిక ఒడి బియ్యం కార్యక్రమంలో పాల్గొన్నారు. మహిళలందరూ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టిఎన్.దీపికకు ఒడి బియ్యం పోసి ఆశీర్వదించారు. కార్యక్రమంలో కురుబ భారతి, లక్ష్మి, ముద్దమ్మ, రాధ, రమ్య, సంధ్య, శశికళ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేయాలి

హిందూపురం టౌన్: సీపీఎస్ రద్దు చేయాలని కోరుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన చేపట్టారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లకు వినతి పత్రం అందజేశారు.

ఘనంగా వరమహాలక్ష్మీ వ్రతం



ర్యాలీ నిర్వహిస్తున్న సరస్వతీ విద్యామందిరం విద్యార్థులు

అమరాపురం : స్థానిక సరస్వతీ విద్యా మందిరంలో శుక్రవారం వరమహాలక్ష్మీ వ్రతాన్ని ఘనంగా జరుపుకున్నారు. ముందుగా లక్ష్మీ వేషధారణలో విద్యార్థినులు పట్టణ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యామందిరంలో లక్ష్మీదేవి చిత్ర పటాన్ని ఉంచి కలశం ఏర్పాటు చేసి అర్చకులు లక్ష్మీ అమ్మవారి కథను చదివి వినిపించారు. భక్తులకు ప్రసాద వినియోగం చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయినులకు ఆటల పోటీలు



పోటీలో పాల్గొన్న ఉపాధ్యాయిని

గుడిబండ: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయినులకు ఆటల పోటీలు నిర్వహించారు. శనివారం ఉపాధ్యాయులకు పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ రవిచంద్ర కుమార్ తెలిపారు. విజేతలకు 5న బహుమతులు అందిస్తామన్నారు.

మధూడిలో 'పొలంబడి'

అగళి: మధూడి గ్రామంలోని జగదీష్ వేరుశనగ పొలంలో శుక్రవారం ఏఓ శేఖర్‌నాయక్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. పంటలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. పంటకు ఆశించే తెగుళ్ల నివారణ చర్యలను తెలియజేశారు. వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చిన్నారుల భవిష్యత్ బంగారుమయం



అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

హిందూపురం: చిన్నారుల భవిష్యత్తు బంగారు మయం చేయడానికి సీఎం జగనన్న అన్ని సదుపాయలతో కూడిన అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహింపజేస్తున్నారని 13వ వార్డు కౌన్సిలర్ సునిత అన్నారు. సీడీపీఓ రెడ్డిరమణమ్మ ఆధ్వర్యంలో టీచర్స్ కాలనీలో అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో వర్కర్లు అరుణ, లక్ష్మి, శైలజ, అమృతవల్లి, అనిత, నారాయణమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటేశ్వరరెడ్డి, శబరిష్, హనుమంతరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడికి గాయాలు

రొద్దం: మండల పరిధిలోని ఆర్ కొట్టాల వద్ద పావగడ–పెనుకొండ ప్రధాన రహదారిపై శుక్రవారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో మండలంలోని ఆర్ మరువపల్లికి చెందిన హరి అనే యువకుడు గాయపడ్డాడు. రొద్దం నుంచి పావగడ వైపు ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా.. ద్విచక్ర వాహనం అదుపుతప్పడంతో కిందపడ్డాడు. యువకుడి ముఖానికి తీవ్ర గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. ఆస్పత్రికి తరలించినట్లు వివరించారు.

మురిపించిన పింఛన్

- పింఛన్ పంపిణీలో 'పురం' మొదటి స్థానం

హిందూపురం: కొత్త పింఛన్లు పంపిణీ చేయడంతో లబ్ధిదారుల్లో ఆనందం వెల్లివిరిసింది. గత టీడీపీ పాలనలో ప్రజాప్రతినిధుల మీటింగ్ వద్ద అర్జీలు పట్టుకుని తిరిగి పడిగాపులు కాచి ఏకరువు పెట్టినా జన్మభూమి కమిటీ సభ్యుల జేబులు నింపనిదే పింఛన్ చేతికందేది కాదు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వపాలనలో ఎవరి సిఫార్సు లేకుండా అర్హతే ప్రమాణికంగా మంజూరు చేసిన పింఛన్ ఇంటికి వచ్చి అందజేస్తున్నారని వృద్ధులు, దివ్యాంగులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆశీర్వచనాలు పలుకుతున్నారు. హిందూపురం మున్సిపాల్టీలో పరిధిలో మొత్తం వృద్ధ్యాప్య పింఛన్లు 12,970 ఉండగా రూ.3,64,77,000 మంజూరైంది. అలాగే 305 మంది కొత్త పింఛన్‌దారులకు రూ.8,36,250 మంజూరైంది. మరో 550 కొత్త పింఛన్ దారుల వెరిఫికేషన్ జరుగుతోంది.

హిందూపురం మండలంలో..

హిందూపురం మండలంలో 7,569 పింఛన్లు ఉన్నాయి. వీరికి రూ.2,07,94,750 మంజూరైంది. 221 కొత్త పింఛన్లు మంజూరుకాగా వీరికి రూ.6,07,750 పంపిణీ చేశారు. మొదటిరోజు హిందూపురం మున్సిపాలిటీ అర్బన్‌లో సుమారు 85.92 శాతం పింఛన్ పంపిణీ పూర్తి చేశారు. దీంతో జిల్లాలో మొదటిస్థానంలో హిందూపురం మున్సిపాలిటీ నిలిచింది.

రొద్దం: మండల వ్యాప్తంగా దాదాపు 300 పైబడి కొత్త పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్ తెలిపారు. మొదటి రోజు దాదాపు 80 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయిందన్నారు. ఎంపీపీ చంద్రశేఖర్ చేతుల మీదుగా పలువురికి పింఛన్ సొమ్ము అందజేశారు. కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు మారుతిరెడ్డి, సర్పంచ్ రూప, పంచాయతీ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

గోరంట్ల: మండలానికి 224 నూతన పింఛన్లను ప్రభుత్వం మంజూరు చేసింది. శుక్రవారం ఆయా గ్రామ పంచాయతీల్లో ప్రజా ప్రతినిధుల సమక్షంలో వలంటీర్లు లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము పంపిణీ చేశారు.



2వ వార్డులో కొత్త పింఛన్లు అందుకుని సీఎం జగనన్నకు కృతజ్ఞత చెబుతున్న లబ్ధిదారులు

మహాలక్ష్మీదేవికి విశేష పూజలు





అలంకరణలో కొల్హాపురి మహాలక్ష్మీదేవి, దుర్గాదేవి

రొళ్ల: రత్నగిరి గ్రామంలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవి ఆలయంలో మూడో శ్రావణ శుక్రవారం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేకం, అంకురార్పణ, కుంకుమార్చన, తులసీ పూజ, గంధాభిషేకం చేశారు. తర్వాత అమ్మవారి మూల విగ్రహంతో పాటు ఉత్సవ విగ్రహాన్ని పట్టు వస్త్రాలు వెండి, బంగారు ఆభరణాలతో పాటు పూలతో అలంకరణ చేసి మహామంగళారతి ఇచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. దాతల సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు.

మడకశిరరూరల్: కల్లుమర్రిలో వీరకేతమ్మ అమ్మవారికి శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు అమ్మవారికి సమర్పించిన చీరలతో ముత్తైదువులకు వడిబియ్యం అందించారు. భక్తరహళ్ళి లక్ష్మీనరసింహస్వామి, జిల్లెడుగుంట అంజినేయస్వామి, నీలకంఠేశ్వరస్వామి, చందకచర్ల ఆంజనేయస్వామి, జమ్మానిపల్లి లక్ష్మీనిడిమామిడమ్మ ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దుర్గాదేవికి ప్రత్యేక పూజలు

లేపాక్షి: శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని లేపాక్షి వీరభద్రస్వామి ఆలయంలో వెలసిన దుర్గాదేవి అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా పుష్పాలంకరణ చేసి దూపదీప నైవేద్యం చేశారు. మహిళలు ఆలయంలో దీపారాధన చేపట్టారు.

డ్రెయిన్లు, వీధి దీపాలు ఏర్పాటు చేయండి

హిందూపురం అర్బన్: గ్రామంలో డ్రెయిన్లు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని దేవరపల్లి వార్డు సభ్యులు కోరారు. శుక్రవారం తూమకుంట గ్రామ సచివాలయంలో సర్పంచ్ రత్నమ్మ అధ్యక్షతన పంచాయతీ సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. తూమకుంటలోని శ్మశాన వాటికకు రహదారి చూపాలని వార్డు సభ్యులు కోరారు. గ్రామంలో రహదారుల మరమ్మతు చేయాలన్నారు. సచివాలయ పరిధిలో ప్రధాన సమస్యలు ఇప్పటికే గుర్తించామని, సమావేశంలో చర్చకు వచ్చిన అంశాలు సైతం పరిగణలోకి తీసుకొని నిధులు మంజూరుకు ప్రతిపాదనలు పంపుతామని కార్యదర్శి కెంచరాయప్ప తెలిపారు. అత్యవసర పనులు ఎప్పటికప్పుడు సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులతో పాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



తూమకుంట సచివాలయంలో సమావేశమైన అధికారులు, ప్రజా ప్రతినిధులు

పావగడను కరువు ప్రాంతంగా ప్రకటించాలి

పావగడ: తీవ్ర వర్షాభావంతో వేరుశనగ పంట ఎండిపోతోందని, పావగడను కరువు ప్రాంతంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ స్థానిక జేడీఎస్ నాయకులు శుక్రవారం పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. స్థానిక తాలూకా కార్యాలయంలో జేడీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆర్సి అంజినప్ప మాట్లాడుతూ కరువు కాటకాలతో పావగడ రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వెంటనే పావగడను కరువు ప్రాంతంగా ప్రకటించి కరువు నివారణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే వెంకటేశ్ ప్రభుత్వం తో మాట్లాడి కరువు నివారణ కు తగినన్ని నిధులు మంజూరు చేయించి కార్మికులు, కర్షకులకు జీవనోపాధి కల్పించాలని కోరారు. అనంతరం జేడీఎస్ తాలూకా అధ్యక్షుడు ఎస్పీ ఈరణ్ణ, మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప, నాయకులు తిమ్మారెడ్డి, గోవిందబాబు, సాగడు వెంకటేశ్ తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందించారు.



కరువు ప్రాంతంగా ప్రకటించాలని ఆందోళన చేస్తున్న జేడీఎస్ నాయకులు

వైఎస్సార్‌సీపీ జెండా ఎగరేద్దాం

రొళ్ల: వచ్చే ఎన్నికల్లో మడకశిర నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరేద్దామని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం పట్టణంలోని జెడ్పీటీసీ బి.అనంతరాజు స్వగృహంలో నాయకులు ఆయన్ను కలిసి వైఎస్సార్‌సీపీలో చేరాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీలు ఎన్నికుట్రలు, కుతంత్రాలు చేసినా వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చి తిరిగి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. ఇండిపెండెంట్ జెడ్పీటీసీగా గెలుపొందిన అనంతరాజును పార్టీలోకి రావాలని నాయకులు కోరారు. తాను అన్ని గ్రామాల నాయకులు, కార్యకర్తలతో సంప్రదింపులు జరిపి నిర్ణయం చేసుకుంటానని జెడ్పీటీసీ చెప్పారు. సింగిల్ విండో అధ్యక్షుడు మోతిరాంనాయక్, జేసీఎస్ కన్వీనర్ నాగేంద్ర, మార్కెట్ యార్డు డైరెక్టర్ శ్రీనివాస్, సర్పంచులు సదాశివప్ప, హరిక్రిష్ణ, కరియమ్మ, శారదమ్మ, ప్రకాష్, చిన్నరంగప్ప, నరసింహప్ప, లక్ష్మమ్మ, ఎంపీటీసీ సభ్యులు నాగరాజు, విశాలాక్షి, సుమ, శివన్న, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు సంతోష్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా కొడగార్లగుట్టలోని పార్టీ మాజీ మండల కన్వీనర్ తిమ్మప్ప మామిడి తోటలో వైఎస్సార్‌సీపీలోకి చేరే విషయం పై శనివారం ఉదయం 10 గంటలకు తాలూకా స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు తెలిపారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు.



నాయకులతో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు

తృతీయ శనివారానికి ఏర్పాట్లు పూర్తి



అలంకరణలో శనీశ్వరుడు



ఆలయంలో పూర్తయిన ఏర్పాట్లు

పావగడ: స్థానిక శనీశ్వరాలయంలో శనివారం నిర్వహించే తృతీయ శ్రావణ శనివారోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు ఆలయ సమితి అధ్యక్షుడు ఆనందరావు శుక్రవారం తెలిపారు. తృతీయ శనివారం భక్తులు ఎక్కువగా వస్తుండడంతో ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా సాధారణ క్యూలతో పాటు సర్వ సేవా పూజలకు ప్రత్యేక క్యూ ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 4 గంటల నుంచి శనీశ్వరస్వామి కి తైలాభిషేకం, నవ గ్రహ పూజలు జరుగుతాయన్నారు. రాత్రి 7 గంటలకు స్వామికి విశేష ఉత్సవం జరుగు తుందన్నారు. ఇదిలా ఉండగా తృతీయ శనివారం పూజలకు అధిక సంఖ్యలో భక్తులు శుక్రవారమే పావగడకు చేరుకున్నారు. దీక్షా మంటపంలో తలనీలాలు సమర్పించుకుని స్వామికి మొక్కులు చెల్లించుకున్నారు. శనీశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

పరిగి: మండలంలోని ఏపీఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాలలో కళ్లకలకతో బాధపడుతున్న విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులు కళ్లకలతతో బాధపడుతున్నారన్న విషయాన్ని తెలుసుకున్న ఎంపీపీ సవిత, ఎంపీటీసీ మారుతీరెడ్డి సత్వర చర్యలు తీసుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారులను కోరారు. స్పందించిన వైద్యాధికారి డాక్టర్ స్వరూప రెడ్డి వైద్య సిబ్బందితో కలసి విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం మందులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మురళీధర్‌బాబు, సీహెచ్ఓ వన్నప్ప, ఆరోగ్య కార్యకర్తలు శ్రీధర్, మంజుల, ఆశావర్కర్ వరలక్ష్మీ పాల్గొన్నారు.

టమాట ఐచర్ బోల్తా



పెనుకొండ రూరల్: మండలంలోని షీఫారం రైల్వే బ్రిడ్జి సమీపంలో శుక్రవారం టమాట లోడుతో వెళ్తున్న ఐచర్ బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కంబదూరు నుంచి మదనపల్లికి టమాట లోడుతో ఐచర్ బయలుదేరింది. ఐచర్ వాహనం పెనుకొండ సమీపంలోని రొద్దం ఘాట్ రోడ్డులో అదుపుతప్పడంతో బోల్తా పడింది. ఈ ఘటనలో ఐచర్ ముందు భాగం దెబ్బతింది. పెనుప్రమాదం తప్పింది. టమాట బాక్సులు కిందపడంతో స్థానికులు సంచుల్లో తీసుకెళ్లారు.

ఇంజినీరింగ్ కార్మికుల కమిటీ ఎన్నిక

హిందూపురం టౌన్: ఏఐటీయూసీ మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీ ఎన్నికను శుక్రవారం నిర్వహించారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో జిల్లా సీనియర్ నాయకుడు దాదాపీర్, జిల్లా ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్ సమక్షంలో కమిటీ ఎన్నిక చేపట్టారు. గౌరవ సలహాదారులుగా భగవంతప్ప, జిలాన్ బాషా, ఆయూబ్‌ఖాన్, శంకర్, అధ్యక్షుడిగా అఖిల్ రాజ్, కార్యదర్శిగా హృదయేశ్వర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రామాంజనేయులు, డిప్యూటీ జనరల్ సెక్రటరీగా నాగమణి, విశ్వనాథ్, ఉపాధ్యక్షులుగా రంజానీ, గంగాధర్, ట్రెజరర్‌గా ఆదిల్, సహాయ కార్యదర్శులుగా భాస్కర్, మంజునాథ్, వరదరాజులు, గిరీష్, రవికుమార్‌తో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు మారుతీరెడ్డి, వెంకటేశప్ప, ముత్యాలప్ప, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

చిలమత్తూరు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం గర్భిణులకు వైద్యాధికారి నికేష్ వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని ఆయన సూచించారు..అనంతరం సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో గర్భిణులు, రోగులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీపతి రెడ్డి, రైతు సంఘం నాయకుడు ప్రవీణ్‌కుమార్, నాగభూషణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మండలాభివృద్ధిపై నేడు సమీక్ష

లేపాక్షి: స్థానిక స్త్రీ శక్తి భవనం (వెలుగు)లో శనివారం ఉదయం 11 గంటలకు మండల అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నరసింహ నాయుడు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీపీ వెంకటరత్నమ్మ అధ్యక్షతన అన్ని శాఖల మండల స్థాయి అధికారులతో సమీక్ష ఉంటుందన్నారు.

పారదర్శకంగా ఓటరు జాబితా తయారీ

మడకశిరరూరల్: మండలంలోని మెళవాయి, గుండుమల, గోవిందాపురం, వైబీహళ్లి, నీలకంఠాపురం, హరేసముద్రంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను శుక్రవారం తహసీల్దార్ ముర్షావలి పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని తహసీల్దార్ తెలిపారు. ఓటరు జాబితాను పారదర్శకంగా తయారు చేస్తున్నామన్నారు. ఆర్ఐ చంద్రశేఖర్, ఎన్నికల విభాగం అధికారులు, వీఆర్ఓలు, సిబ్బంది పాల్గొన్నారు.



వైఎస్ వర్ధంతి కార్యక్రమానికి తరలిరండి



హిందూపురం: హిందూపురం నియోజకవర్గ ప్రజల దాహార్తి తీర్చి ప్రతికుటుంబంలో ఒక్కడిగా నిలిచిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ కుటుంబసభ్యులందరూ తరలిరావాలని నియోజవర్గ సమన్వయకర్త టిఎన్.దీపిక పిలుపునిచ్చారు. ఉదయం 8గంటలకు స్థానిక పరిగి బస్టాండ్‌లోని వైఎస్సార్ విగ్రహం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పిస్తామన్నారు.అనంతరం అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ మున్సిపల్ ఛైర్మన్, వైఎస్‌ఛైర్మన్లు, కౌన్సిలర్లు, ఎంపిపీలు, వైస్‌ఎంపిపీలు, జెడ్పిటీసీలు, సర్పంచులు, ఎంపీటిసీలు, సింగిల్‌విండో అధ్యక్షులు, మండల కన్వీనర్లు, కోఅప్షన్‌సభ్యులు, వార్డు ఇన్‌చార్జిలు, అన్ని విభాగాల సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలన్నారు.

లేపాక్షి: దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని లేపాక్షిలోని వైస్సార్ విగ్రహం వద్ద శనివారం ఉదయం 9.30 గంటలకు నిర్వహిస్తామని పార్టీ మండల కన్వీనర్ నారాయణస్వామి శుక్రవారం తెలిపారు.

నేడు వైఎస్సార్ వర్ధంతి

మడకశిర: పట్టణంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద శనివారం ఉదయం దివంగత సీఎం వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ కవిత తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి హాజరవుతారని, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీప శ్రేణులు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు.

అమరాపురం: స్థానిక శిరా రోడ్డులోని వైఎస్సార్ సర్కిల్ వద్ద శనివారం ఉదయం 10 గంటలకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఎంపీపీ ఈరన్న, జెడ్పీటీసీ సభ్యురాలు స్వారక్క తెలిపారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీప శ్రేణులు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు.

పరిగి: మండల కేంద్రంలోని వైఎస్సార్ సర్కిల్‌లో శనివారం ఉదయం 9 గంటలకు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్నట్లు మండల కన్వీనర్ నరసింహమూర్తి తెలిపారు.

సోమందేపల్లి: వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతిని శనివారం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, మాజీ కన్వీనర్ వెంకటరత్నం తెలిపారు. ఉదయం 10 గంటలకు స్థానిక వైఎస్సార్ సర్కిల్ వద్దకు పార్టీ శ్రేణులు తరలిరావాలని కోరారు.

ఓటరు జాబితా పరిశీలన

లేపాక్షి: మండలంలోని కంచిసముద్రం, బయన్నపల్లి, శిరివరం గ్రామాల్లో జరుగుతున్న ఓటరు వెరిఫికేషన్‌ను మండల స్పెషల్ ఆఫీసర్ సుదర్శన్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి ఆయన పలు సూచనలు చేశారు. మృతిచెందిన వారి ఓట్లు, వలస వెళ్లిన వారి ఓట్లు ఇంటింటికీ వెళ్లి పరిశీలించి తొలగించాలన్నారు.

మడకశిర నియోజకవర్గంలో మోస్తరు వర్షం

మడకశిరరూరల్: మడకశిర నియోజవకర్గవ్యాప్తంగా గురువారం రాత్రి మోస్తరు వర్షపాతం నమోదైంది. మడకశిర మండలంలో 35 ఎంఎం, అమరాపురంలో 74 ఎంఎం, అగళి 40.6, గుడిబండ 30.4 ఎంఎం, రొళ్లలో 6.4 ఎంఎం వర్షపాతం నమోదైనట్లు శుక్రవారం రెవెన్యూ అధికారులు తెలిపారు. ఖరీఫ్‌లో సాగు చేసిన వేరుశనగ, ఇతర పంటలకు ఈవర్షం ఎంతో అనుకూలంగా మారిందని రైతులు చెబుతున్నారు. బీడుభూముల్లో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయడానికి రైతులు భూములను సిద్ధం చేసుకుంటున్నారు. ప్రభుత్వం 80 శాతం సబ్సిడీతో అందిస్తున్న ఉలవలకు ఆర్బీకేల్లో రైతులు పేరు నమోదు చేసుకుంటున్నారు.

నాడు-నేడు పనులు త్వరితగతిన పూర్తి చేయాలి



ఫలారం ప్రాథమిక పాఠశాలలో నాడు-నేడు పనులను పరిశీలిస్తున్న ఎంఈఓ రవిచంద్ర

గుడిబండ: మండలంలో నాడు–నేడు రెండో విడత ఎంపికైన 52 పాఠశాలల్లో పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని ఎంఈఓ రవిచంద్రకుమార్ సూచించారు. శుక్రవారం బూదిపల్లి, మండలపల్లి, ఫలారం పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం నాడు–నేడు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండవ దశ నాడు–నేడు ఎంపికైన పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు పనులను త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.


బాలుడి అదృశ్యం

సోమందేపల్లి: మండల కేంద్రంలోని బాలాజీ నగర్‌కు చెందిన చైతన్య కుమార్ (13) అనే బాలుడు అదృశ్యమైనట్లు తండ్రి శాంతన్న శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. స్నేహలత నగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న బాలుడు ఆగస్టు 27వ తేదీ నుంచి కనిపించడం లేదని తెలిపాడు. కేసు నమోదు చేసుకుని బాలుడి ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు ఎస్ఐ విజయ్ కుమార్ తెలిపారు.

ఆరు ఆటోల సీజ్

సోమందేపల్లి: మండల కేంద్రంలోని వైఎస్సార్ సర్కిల్ వద్ద శుక్రవారం సాయంత్రం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా పరిమితికి మించి ఓవర్ లోడ్‌తో వెళుతున్న ఆటోలపై కేసు నమోదు చేశారు. ఆరు ఆటోలను సీజ్ చేసినట్లు ఎస్ఐ విజయ్ కుమార్ తెలిపారు.

ధోబీఘాట్ సమస్య పరిష్కరిస్తాం



సమన్వయకర్త టి.ఎన్.దీపికకు సన్మానిస్తున్న రజకసంఘ నాయకులు

హిందూపురం: రజకులకు ధోబీఘాట్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరింపజేస్తామని హిందూపురం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టిఎన్.దీపిక అన్నారు. బైపాస్‌రోడ్డులోని వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయం వద్దకు హిందూపురం వాషర్‌మెన్ కో ఆపరేటివ్ సొసైటీ సభ్యుల ఆధ్వర్యంలో రజకులు తరలివచ్చి సమన్వయకర్త టి.ఎన్.దీపిక, నియోజకవర్గ నాయకుడు గుడ్డంపల్లి వేణురెడ్డిని కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ధోబీఘాట్ సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు నాగమణి, విశ్రాంత ఎస్ఐ లక్ష్మీనారాయణ, అధ్యక్షుడు కుళ్లాయప్ప, ఉపాధ్యక్షుడు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.